# జీవన జ్యోతి

**శ్రీ పి. చలపతిరావు**

తల్లిదండ్రులను చిన్ననాడే కోల్పోయిన సుమిత్ర దురదృష్టవంతురాలే; ఐతే ఆమె మెట్టినింటి మనుషులమంచి హృదయాలను బట్టి అదృష్టవంతురాలు. గుండెనుపిండే అర్థం ఓమాటలోను, హృదయాన్ని తన్మయించేసే మధుర భావం యింకో మాటలోను వుందని అర్థంచేసుకోవడం ఇక్కడ అవసరం.

సుమిత్ర నిరక్షరాస్యతను లోకం క్షమించకపోవచ్చును కాని ఆమెపాలిట అదో అమోఘమైన వర మయిందని బోధపడినప్పుడు క్షమించక విధిలేదు. ఈ అల్పవిషయంలో సుందరం మానసికస్థితి మనం గ్రహించొచ్చు. పట్నం యువతంటే అతగాడికి రోత అనడానికి నాగరికతే కారణం అనుకొంటే మనం తప్పుటడుగుగే వేసిన వాళ్ళమౌతాం—నాగరికత పేరుతో ముఱికి నంతటినీ అనుకరిస్తారని అతగాడి బాధే పల్లెపడుచు అనే మాటలోని మృదుత్వాన్ని అనుభవించ గలిగింది. ఎంతో నిదానంతో స్వీకరించాడు సుమిత్రని.

ఆ దినం సుందరం ఆఫీస్‌కి వెళ్ళిపోవడంతో సుమిత్ర అత్తయ్యతోచెప్పి బిందెపట్టుకొని నదికివచ్చింది. చైత్ర మాసానికే నాగావళి సన్నబడింది. ఉరకల ఉద్వేగం శాంతించింది. అందంగా మెరిసే సైకతాలు. మధ్య నిర్మలంగా, శాంతంగా కాలువలుగాచీలి, కలిసి ప్రవహించే నది. అక్కడక్కడ నల్లని రాళ్ళు. ఆ రాళ్ళదగ్గర లోతు గుమ్ములు. జనం సుమారుగా లేరు. ఊరు సంతగోల వినిపిస్తోంది.

వీధులు తిరిగి రావల్సిన అవసరం యేమీలేదు కనక సుమిత్రకి నదీస్నానమే సరిపోయింది. పెరటిసందులోంచి వచ్చేస్తే సరుగుడుతోటలు. ఇసికదిబ్బలు. జనం గోలలేని రేవు. ఆ పట్టణానికి యింకో వరమనిపించే అందమైన పొలాలు—ఆ వెనుక జేగురు రంగు కొండలు. ఇంకా వెనక్కి నీలంకాంతి తెరలు.

ఆమెకంటే ఓక్షణం ముందే వచ్చాడు రాంబాబు. ఇది రోజూవచ్చే రాంబాబు వేళకాదు. బట్టలుమాసాయి. తలంటుకోవాలి. అందుకు సరైన సమయం యిదేనని వచ్చాడు. రాయిమీదకి పోయి గుడ్డలుతడిపి సబ్బుపెట్టుకొంటున్నాడు.

సుమిత్రని చూడడం రాంబాబుకి యిదే ప్రథమం—ఆమె జుత్తు ముడివిప్పుకొని తలంటుకొనేందుకు సిద్ధమౌతోంది. ఆమె సిగలోని గులాబిపువ్వు రాలిపోయింది. ప్రవాహం రాంబాబు వైపు పోతోంది. ఆ పువ్వు తలలో వుందన్న విషయం కూడా ఆమెకి తెలీదు. గులాబి రోజూ పూయదు. పనితొందర్లో వున్నపుడు సుందరం సిగలో పొదిగాడు ఆ కుసుమాన్ని. ఆ సంగతి, ఆమెకి జ్ఞాపకమే వుంటే జాగ్రత్తగా బిందెలో దాచేదే. ఎందుచేతనంటే ఆ కుసుమాన్ని రాత్రి మళ్ళీ భర్తకి పునరుంకితం చేసుకున్నప్పుడే బాధ్యత పూర్తవుతుందన్నది ఆ దంపతులకు అలవాటు పడ్డ విషయము. గులాబి అలా ఈదుతూ వచ్చి రాయి దగ్గర సుడిలో పడి మలువు తిరిగింది. ఆమె కిచ్చేయాలనే ఉద్దేశంతోనే రాంబాబు ఆ పుష్పాన్ని కోమలంగా అందుకొన్నాడు. తర్వాత అతని పరిస్థితి సంకటంగానే మారింది. చేతిలోకూడ ఉంచుకోలేక సబ్బుపెట్టెలో దాచాడు. అది ఉన్న కొద్దీ అతని బాధ యెక్కువయింది. ఇవ్వాలని సాహసం ఓపక్క. ఇస్తే ఏమంటుందో అనే భయం ఇంకోపక్క. మొదట్లోనే ఆ పనిచేసివుంటే బావుండేది. ఇంతటి విరామానంతరం యివ్వడానికి అతనికి మన సొప్పడంలేదు. ఇంక బాధపడలేక దాన్ని మళ్ళీ ప్రవాహంలోకి విసిరేసాడు.

సుమిత్ర మంచి తనానికి రాంబాబు యే విధంగానూ తీసిపోడు. అలాంటి యవ్వనంలోవున్న యింకో మగపురుగయితే ఆమె స్నానభంగిమలన్నీ చూసి రాత్రి కలగనేవాడు మళ్ళీ. సుమిత్ర అంత అందంగా స్నానం చేస్తోందా అనికాదు—ఎవరయినా అంతే. సుమిత్ర స్నానంకంటే రాంబాబుని ఆకర్షించేది యింకోటి వుంది—అది దూరాన పంచభూతాల్లో కలుస్తున్న మానవ దేహం.

అంతలో ఒకరిద్ద రాడమ్మలు రేవుకి వచ్చారు. నిజానికి వాళ్ళు సుమిత్రని విచిత్రంగా చూసారు. సుమిత్రకి లోకాన్ని పట్టించుకొనే అవసరం రాలేదు. చెప్పుకోవల్సి వచ్చినప్పుడు ఆమెకి యీ లోకంలో అనేక విరుద్ధాలు, వికృతాలు వున్నాయన్న విషయంకూడా తెలీదు. తెలిసినదంతా కల్లాకపటం ఎరగని ఓ పల్లెటూరు, ఆ పక్కనించి ఓదార్పుతోపోయే నాగావళి, మీసాలతాత, మెట్టినింటిలోని రెండు జీవితాలు—యిక్కడా, ఆ నాగావళి సైకతాలు, ఆ ఓదార్పులు—అంతే. అంచేత చిన్ననాటినించీ సుమిత్ర ఆ నదీమాత మూగపాలనలోనే పెరిగింది. దైనిక జీవితంలో ఆమెని మానసికంగా, దైహికంగా అలంకరించేది కూడ ఆ మాతృశ్రీయే.

రాంబాబు పక్కకి చూసాడు. మరి కనిపించ లేదు గులాబీ రంగు. ఇప్పుడన్నా సుమిత్ర గుర్తు తెచ్చుకుని గులాబీని వెతికే యత్నం బహిర్గత మయుంటే రాంబాబు వెళ్ళి తెచ్చి యిచ్చేవాడే. ఆమెకి ఆ గుర్తులేనే లేదు. శిరోజాలు చీర చెంగుతో ఒత్తుకొంటోంది. లేతగా పసుపు పూసుకోవడం వలన సువర్ణశిల్పంలా దృగ్గోచరమౌతోంది. ఆమె చూపులు చూసాడు. హృదయంలోని మంచితనం కళ్ళలో మెరుస్తోంది. అంత మంచితనాన్ని చాలాసేపు

కరువుదీరా చూసే అదృష్టం అతనికి లభించలేదు. అందుకు రాంబాబు కళ్ళుమూసికొని సాగిన తీగెలాంటి మెత్తని ఊహని నిలుపుకొన్నాడు. తన జీవిత చరిత్రలో అలాంటి సోదరిపాత్ర ఒకటి వుంటే ఎంత మనోహరంగా వుండేదో తలంచుకొంటు న్నాడు.

సుమిత్ర బిందెతోమి, కడిగి, కొంచెం లోపలికిపోయి నీరునింపి ఎత్తుకోబోతే ఒక్కసారి ముఖారవిందం విషాదావృత మవగా బిందె కిందికి దింపింది. లిప్తలో ఆమె వాడిన మొక్కలా నిర్జీవమై పోయింది. ఆమెకళ్ళల్లో దిగులు పులుముకొంది. బేల అయింది. నీటిలో చేతులుపెట్టి యిసికని వెతుకుతోంది.

ఉతికిన గుడ్డలు పట్టుకొని, తడితువ్వాలు కప్పుకొని వస్తోన్న రాంబాబుకి యీ సంఘటన చాలా ఆశ్చర్యం కలిగించింది. ఆమె దైన్య వదనంలోకి అవలోకించి చివుక్కు మన్నాడు. భయంతో శరీరం జలదరించింది. "ఏమయిం దమ్మా?" అన్నాడు ఓపలేక.

సుమిత్ర తడబడింది. చెప్పలేని కొన్ని విషయా లున్నాయి. అలాంటి విషయాలకి పరిస్థితి, వ్యక్తులు, వాతావరణం, సంబంధం మొదలయినవి కారణం అవొచ్చు. అలా చెప్పక పోయినంత మాత్రాన అర్థం కాకపోవు. కొంచెం పరిశీలించాలి. కొంత ఊహించాలి. మరింత యోచించాలి. అన్నిటి కంటే ముఖ్యం చురుకైన బుద్ధి. ఏదో వస్తువు పోయిందన్న సంగతి తొలుదొల్తే గ్రహించాడు. ఆ వస్తువు ఏమయ్యుంటుందన్నది కొంతవరకు అంతు చిక్కింది. ఏదో ఖరీదయిన నగ.

సుమిత్ర మరోసారి తన గుండెల్ని వెతుక్కొంది. రాంబాబు మనో నేత్రంలో ఆమెకోల్పోయిన వస్తువేదో ఊగిస లాడింది. అతనిఊహ నిజమైతే—అతని దృష్టిలో — ఆమె అంత బాధ పడడం సానుభూతి కారకమే.

"మీరు వేసుకొనే వచ్చారా?"

ఆమె జాలిగొల్పే చూపు చూసింది. తన మెళ్ళోంచి ఆ సుమంగళిని యెప్పుడూ తీయదు. సరిగదా స్ఫురణ కొచ్చి నప్పుడల్లా కనులు కద్దుకొని ముద్దిడుకొని గుండెల్లో దాచుకొంటుంది. అన్నివిషయాలు ఆ చిన్నచూపులో సుబోధకమయ్యాయి. రాంబాబు ఒడ్డున, బిందెదరి, తడిగుడ్డలు పడేసి వెతుకుతున్నాడు. జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు ఆమె యెక్కడ స్నానంచేసిందో; ఆలోచిస్తున్నాడు ఆ వస్తువు నీట పడిన తరువాత ప్రవాహ వేగంతో ఎంతదూరం పోయుంటుందో, ఆకారం ఎలాంటిదో.

ఆమె అశ్రురాశిని నాగావళి రుచి చూస్తోంది. ఆమె విషణ్ణ వదనంలో వేదనచూసి కంట తడి పెట్టాడు. "మీ రెందుకు బాధ పడతారు. దొరుకుతుందమ్మా" అంటూ తనకి మిగిలిన చిన్న ధైర్యంతో ఓదారుస్తున్నాడు.

ప్రయత్నానికి ఫలితం ఏదో ఒకటి వుండాలి. ఆశో, నిరాశో. ఆ రెండూ లేవు వారిలో. దుఃఖం, బాధ తప్ప. గుడ్డ పీలికలూ, తాళ్ళూ, కర్రపుల్లలూ అలాంటి వేవో అప్పుడప్పుడు తగిలి ఆశ కల్గిస్తున్నాయి. ఒడ్డున బాగాచూస్తే ఇసిక స్పష్టంగా కన్పిస్తోంది. అంత నిర్మలంగా వుంది నీరు. పైగా ఎండ. కాని మధ్యలో ఇసిక కనిపించలేదు.

"ఎంత ఎత్తు?" అని సన్నిహితునికి మళ్ళే ఆ ప్రశ్న. రాంబాబు ఓదార్చాడు. ఆమె వినిపించుకున్నట్టు లేదు. లేక ఇంకో ఆలోచనలో వుండి యీ ప్రేరణకి ప్రతీకారం యివ్వలేకపోయిందో మనసు. ఈసారి, "ఎంతెత్తుందమ్మా—నగ?" ఆమె దృష్టిని తనవేపు మళ్ళించే గొంతుతో అడిగాడు. ఆమె ఐదు తులా లంది. తాడుకూడా బంగారందే. ఫాలానికి అద్దుకొనేందుకు వీలుగా ఒదులుగా అత్తయ్య చేయించింది. అంతకు మించి యింకో నగంటూ ఆమె శరీరంలో లేదు. అసలు నగలంటే సుందరంకి పడదు. ఇంత బంగారంతో మంగళ సూత్రం చేయించారంటే అది అమ్మ ఆజ్ఞప్రకారం. ఆమెను బాధపెట్టడం యిష్టంలేక అతగాడు మౌనం వహించాడు. సుమిత్ర లేస్తూనే ఆ మాంగల్యాన్ని ఫాలానికి, కళ్ళకి అద్దుకోవడం, తన పాదధూళిని తీసుకోవడం అతగాడికి ఇష్టం అనికాదు. సుమిత్ర అందమైన సాంప్రదాయానికి విఘాతం కల్గించి ఆమె మనసుకి బాధపెట్టకూడదనే కారణం. అంచేత ఆమెచేష్ట లన్నీ సంతోషంగా స్వీకరించేవాడు. "ఈవాళ గౌరీ పౌర్ణమి. సుమిత్ర నీ గురించి ఏడున్నర వరకూ ఆగదు. తొందరగా రావాలబ్బాయ్" అనిఅమ్మ అంటే ఆఫీసర్ దగ్గర ఓ చిన్న అబద్ధమన్నాచెప్పి యింటికి చక్కా వచ్చేవాడు. ఆమె చేత పూజ చేయించుకొని శుభం పలకడం అతనికో ఆనందం.

చాలాసేపయింది. సూర్యుడు తలమీదికి వచ్చాడు. ఇది ఆలస్యం అన్నసంగతి సుమిత్రకి యింకా తెలీదు. కాని రాంబాబుకి తెలుసు. సెకండరీ ట్రయినింగు అవుతున్నాడు. హాస్టల్‌లో ఉంటుంన్నాడు. అందరి భోజనాలు అయిపోయుంటాయి. తనభోజనం ఎవరు తీసారో; లేదో—లేకపోతే ఆ పూటకిదుప్పే. అందుకని "మీరింట్లో చెప్పండి. ఎవరినన్నా తీసుకొనివచ్చి వెదికితే దొరక్కపోదు. పడింది మాయమయిపోతుందా? తప్పక దొరుకుతుంది" అన్నాడు.

నిజానికి యీ మాటలు వినిపించలేదు సుమిత్రకి. సుమిత్ర అన్యథా యోచిస్తోంది. యోచించడం అనడం కంటే జ్ఞాపకం తెచ్చుకొంటోంది అంటే బావుంటుందనుకొంటాను. ఆమెకి పదేళ్ళవయస్సులో, అంటే యిప్పటికి తొమ్మిదేళ్ళక్రితం, తమ పొరిగింటి లచ్చిమి మంగళ సూత్రం యిలాగే పోయింది. పోయిన పక్షం నాటికి భర్తపోయాడు. భర్తపోయిన మూరు పక్షంలో లచ్చిమి ఇద్దరి చిన్నారి బిడ్డల్ని పేదరికానికి దౌర్భాగ్యానికి విడిచిపోయింది. అప్పుడు అనుకొన్నారు....వివాహ మూహూర్తం చెడ్డదని; మాంగల్యం పోవడం దుశ్శకునం అని. ఆ మాటలు సుమిత్ర ఎప్పుడో మరిచిపోయింది కాని యీ సంఘటన తీగె లాగడంతోనే డొంకంతా కదిలింది. ఆ యోచనలో వినిపించుకో లేదు.

ఆ స్మృతి సుమిత్ర విషణ్ణ వదనాన్ని మాలిన్యం భూయిష్ఠం చేసింది. ఆ దుర్గంధం కంపు కొట్టడంతో రాంబాబు గ్రహించాడు. ఆమె మనసుని నిర్మలం చేయాల్సిన బాధ్యత తనమీద ఉన్నదన్న విషయం స్ఫురించింది. వెంటనే 'పోయిందని బాధపడొద్దు. నా కొకాయన తెలుసు. మా స్నేహితునిఉంగరంపోతే వెతికితీసాడు చిటికెలో. దొరికి తీరుతుంది. ఇంటికివెళ్ళి చెప్పండి.

బాధ పడొద్దు." అని ఆమె అవధానాన్ని తనమాటల వేపు కేంద్రీకరించి చెప్పాడు. ఆమె రాంబాబువేపు చూసింది. రాంబాబు కంటే దూరాన వున్న శవదహనంలోని జ్వాల ఆమెకి ముందుగా కన్పించింది. రాంబాబు పసికట్టాడు.

"నే చెప్పింది విన్నారమ్మా" అన్నాడు గంభీరంగా. "మీరు దయ ఉంచి లేవండి. ఇక్కడేపొద్దు గడపకండి. సాయంత్రం జనంవస్తారు. తొందరగాపోయి — ఇంట్లో ఈ విషయం చెప్పండమ్మా" అన్నాడు. రాంబాబుకి ఆశ్చర్యం—తను యీ ఇరవైయేళ్ళ వయస్సులో ఎవరికీ ఇలా సలహాలిచ్చి యుండ లేదు. ఆమె గౌరవం సంపాదించుకొనేందుకన్నా ఆ వస్తువు తనకి దొరికితే బావుండుననే ఆశ అతనికి లేకపోలేదు. దొరుకుతుందనే ఆశ ఆమెకంటే అతనికే అధికంగావుంది.

అప్పటి సుమిత్ర పరిస్థితి భిన్నం. ఆమెమనస్సు పూర్తిగా వశపరచుకొంది. లచ్చిమి సంసారం పదేపదే స్మృతిలో కదులతోంది. దానికితోడు శవదహనంలోని జ్వాల. సుమిత్ర ఎంతో పట్టుదలతో భర్తపాదాలను జ్ఞాపకం తెచ్చుకోబోతోంది. కాని కష్టమౌతోంది. ఆ రూపం మరణానంతరం పేలవమైన పాదాలుగా వుండడంతో ఆమె కంపించి పోతోంది.

"మీ తమ్ముమనిలా చెబుతున్నానమ్మా. వినండి నామాట." అనేసరికి సుమిత్రకి భాష అర్థమయింది. అతని కళ్ళలో నిలచిన బిందువులనుచూచి 'మీకు శ్రమ పెట్టాను—కదూ' అని నిట్టూరుస్తూ లేచి బిందె పట్టుకుంది.

"పౌరోహితున్ని అడగండి. దీని కేదో క్రియవుంది. గౌరీ పూజ చేయిస్తా రనుకొంటాను. తర్వాత మళ్ళీ కొత్తది ధరించొచ్చు."

ఆ మాట సుమిత్రకి ఆశకలిగించడం యదార్థమేకాని అంత బంగారం ప్రస్తుతం యెక్కడుంది. అత్తయ్య మెడలోని బంగారమంతా తీసేసి యీ నగ చేయించింది. ఈ విషయం తలంపుకొచ్చేసరికి మళ్ళీ ముఖం విచారగ్రస్త మయింది.

దారి చీలిపోయింది. రాంబాబు ఓ దారిలో పోయాడు. సుమిత్ర సరుగుడు చెట్లుకిందినించి, సందులోంచి తమ పెరట్లోకి వెళ్ళిపోయింది.

రాంబాబు దైన్యావస్థ చూసిన సహాధ్యాయుల ప్రశ్నల వర్షం కురిపించేసరికి అతడేం సమాధానం చెప్పలేకపోయాడు. చెప్పక పోవడమే చాలా మంచిదనిపించిం దతనికి తర్వాత.

* * *

మునిమాపువేళ. పక్కింటి స్టూడెంటుతో కబురుపెట్టి సుందరంని రప్పించింది సుమిత్రఅత్త. జరిగినవిషయం చెప్పేసరికి సుందరం పడ్డబాధ యింకో రకంది. మాంగల్య మాహాత్మ్యం మీద అతగాడికి అంత పట్టింపులేకపోవడమే అందుకుకారణం: అతగాడి బాధంతా విలువమీద—అంటే ఆర్థికంగా నష్టపోయినట్టుమాత్రమే నొచ్చుకుంటున్నాడు. భర్తని చూసిన తర్వాత సుమిత్ర ఒళ్ళు వణికిపోయింది. అతగాడి కళ్ళల్లోకి చూడలేకపోయిన ఆమె కళ్ళల్లో భాష్పరాశి నిండింది.

పురోహితుడు వచ్చాడు. అతడు రావడంతో ఇంటినీ, మనుషులనీ పరిశీలించాడు. వరండాలో పద్మాసనంలో కూచున్నాడు. విబూదీ—ఝుంధ్యం—చేతిలోపంచాంగం—సుద్దముక్క—బుజంమీద తడిగావంచా. బొజ్జ అతనికి నిండుదనం ఇచ్చిన సంగతికూడా పేర్కొవడం ఉచితం.

సుందరంతల్లి చెప్పిన సంగతులకి పురోహితుడు ఆశ్చర్యపోతున్నాడు. అతని ఆశ్చర్యంచూచి ఆమె భయపడుతోంది.

"గ్రహశాంతిచేయాలి. ఇది భర్తకి దోషం—" ఇంకా యేవోచేర్చికూర్చి చెబుతున్నాడు. సరిగ్గా యీమాటలు చెబుతున్నప్పుడే సుమిత్ర బయటికి తొంగిచూసింది. ఆమెకి వినిపించిన మాటలు అవే. ఇంకా వినేశక్తి ఆమెలో యీషన్మాత్రం వున్నా పరిస్థితి యింకో విధంగా మారేది. ఆమె వినలేక పోయింది. లోపలికి పోయింది.

గదిలో భర్త సాలోచనగా మంచంమీద పడుకొని శూన్యంలోకి చూస్తోండడం తర్వాత ఆమె దృష్టిలో పడిన సంఘటన. రెండేళ్ళనించి కాపురంచేస్తున్నా ఆమెభర్తకి యెదురుగా నిల్చి ఒక్కమాట పెగల లేదు. ఆమెకు అలవడిందల్లా 'ఆఁ'. 'ఊఁ'....'ఉహూఁ'....'ఆ?'....'సరే'....'అవును'....'కాదు'....... 'నాకు తెలియదు'....ఇంక కొన్ని నవ్వులు....కొన్ని చూపులు' అంతే. అత్తయ్యతోకూడా అమితంగా యేం మాటలాడదు. అలాంటి వాతావరణంలో పుట్టడమే అందుకో కారణమనుకొందాం.

భార్యలోని వ్యాకులత సుందరంకి అర్థమయింది. సానునయంగా ఆమెని ఓదార్చాలని ప్రయత్నం చేయాలని తలంచాడు. కూర్చొని అందుకే 'సుమిత్రా—యిలా రా'—పిలిచాడు. ఆమెదగ్గరికి వచ్చి పరితప్తహృదయంతో కాళ్ళదగ్గర నిలబడింది. ఇంకా యేం మాట్లాడాలో ఆలోచిస్తున్న సుందరం గభాలున 'ఏదీ నీ సిగలోని గులాబీ చూపించు' అన్నాడు. అప్రయత్నంగా వెతుక్కొంది. ఉదయం తలలో పెట్టినట్టు గుర్తుకొచ్చింది. ఎక్కడో పోయిందన్నది నిర్ధారణ అయేసరికి ఆమెలో బాధ మళ్ళీరగులుకొంది. అది గ్రహించాడు సుందరం. ఆ సంగతి మరిపించాలనే కోరికతో 'చూడు సుమిత్రా—అంత బాధపడకూడదు. నేనూ విచారిస్తున్నాను కాని—' ఆ తర్వాత ఎన్నో విషయాలు ఓదార్చేయత్నంతో చెబుతున్నాడు. ఆమె వినుపించుకోలేదు. అద్దంలో ముఖంకనిపించింది. నుదుట తిలకం లేదు. మెరుస్తోవుండే తిలకంలేదు. పెట్టుకోలేదు? లేకపెట్టుకొనే భ్రమించిందిదా? మళ్ళీచూసింది. నిజంగానే లేదు. అక్కడా వుండలేక పోయింది. పెరటికి వంటగదిలోకి పోయింది. పొయ్యిలో జ్వాల—శవదహనం జ్వాల—కళ్ళు మూసుకొంది. నిండిన కన్నీరు కురిసింది. నిజానికి సుమిత్ర ఫాలాన తిలకం వుండనే వుంది. కళ్ళలో అశ్రువులు చేరడంలో ఆమెకి కన్పించలేదు సరిగ్గా.

సుమిత్రఅత్త ఏవిధమైన బాధా కనపరచలేదు. అలా అని బాధ లేదనుకోవడం పొరపాటు. కాని కోడలి బెంగచూస్తే—యింకా భయపెట్టడం నేరంగా ఆమె భావించుకొంది. సుందరం రావడంతో ఆదేహెచ్చరించింది. 'సుమిత్రను యీ విషయంలో బాధపెట్టేవ్....అప్పుడే కుప్పకూలింది. మరీ బెంగపెట్టుకొనేను. దోషముంటే గ్రహశాంతి చేయిద్దాం. పురోహితునికి కబురు

పెట్టాను....' ఆ విధంగానే సుందరంకూడా ప్రవర్తించాడు. కాని ఆ బలహీనత సుమిత్రలో వుంది. ఈ విషయంలో యింత బాధ పెట్టుకోవడం అర్థంలేనిదిగా కన్పించొచ్చు. భారతస్త్రీలో యేర్పడే రసభావం అటువంటిది. ఆమె పంచేంద్రియాలూ పట్టుకున్న జీవనజ్యోతి మాంగల్యం. ముఖ్యంగా సాంప్రదాయాల్లో పుట్టిపెరిగిన సుమిత్ర దగ్గర యీ జీవనసూత్రం అన్నివిధాలా అనుకూలించింది.

* * *

భర్త అమాయకంగా నిద్రపోతున్నాడు. సుమిత్రకి నిద్ర రావడంలేదు. కళ్ళు బరువౌతున్నాయి. మంచంపక్క చాప పరుచుకొని పడుకొంది. అలా చూస్తోంది. రాత్రి పది దాటిం దేమో. రాంబాబు జ్ఞాపక మొస్తున్నాడు. ఉదయంనించి జరిగిన సంఘటనలు గుర్తుకొస్తున్నాయి. వెతకడానికి వెళ్ళిన వాళ్ళకి రిక్త హస్తాలు మిగిలాయి.

సుమిత్ర గోడవేపు చూస్తోంది. తెల్లనిగోడమీద బెడ్ లైట్ కాంతితో ఓ రిబ్బన్ చుట్టుకొన్న నీడ కనబడుతోంది. ఆ నీడ క్రమంగా మంగళ సూత్రంలా అయిపోయింది. సుమిత్ర గుండెలో వెతుక్కొంది. ఏమీలేదు. తన ఫాలానికద్దుకొనేందుకు ఏమీలేదు. మళ్ళీ ఆ నీడని చూసింది. సరిగ్గా తన మంగళ సూత్రం పరిధిలోనే వుంది. కనురెప్పలు బరువుగా పడుతున్నాయి. కళ్ళల్లో ఆర్ద్రత యిగిరిపోవడంవలన రెప్పలుజారి మూసుకోవడం లేదు. ప్రయత్నంమీద కళ్ళుమూయగల్గింది. మనస్సులో అదేనీడ. భౌతికంగా, మానసికంగా కూడ ఆమె అలసిపోయింది. లచ్చిమి .... లచ్చిమిభర్త .... శవదహనం .... గులాబీ— 'నేను విచారిస్తున్నాను కాని'' .... 'ఇది భర్తకి దోషం' .... అద్దంలో తిలకంలేని ఫాలం—పొయ్యిలోని జ్వాల—ఆ నీడలు ఆమెలో మాయమైపోయాయి. నిద్రపోతొంది. కళ్ళముందు భర్త నిర్జీవమైనపాదాలు—చల్లబడ్డపాదాలు—ఆమె దగ్గర కొస్తున్న మంగళసూత్రం .... ఆ సూత్రానికి యిరుక్కొన్న భర్త కంఠం...

సుమిత్ర పెద్దకేక భయం ప్రతిధ్వనించినట్టు వేసింది. నిల్చొంది. గోడమీద తలకొట్టుతోంది. సుందరం లేచాడు. అనంతావేశంతో ఆమెని లాగి తీసుకొచ్చి, 'సుమిత్రా....సుమిత్రా' అనికేకలు వేస్తున్నాడు. పలకదు. తెల్లబోయి మౌనంగాచూస్తుంది. సుందరంతల్లి వచ్చింది.

సుమిత్ర ఏడుస్తోంది. సుందరంతల్లి మంచంమీదకి తీసుకపోయి పడుకోబెట్టింది. సుమిత్ర శాంతించింది.జాగరం చేస్తూ కూచొన్నారు తనయుడూ, తల్లీ—ఆరాత్రికి.

* * *

రాంబాబు యీ మధ్య రెండుదినాలు సెలవుతీసుకొని స్వగ్రామం వెళ్ళాల్సివచ్చింది. సంబంధం చూడడానికి నాన్న రమ్మన్నారు. రాంబాబుకి యింత తొందర్లో పెళ్ళి ఏదృష్టిలోనూ యిష్టంలేదు. 'రాలేను. చూడాలనిలేదు' అని రాంబాబు చెప్ప గలడు. కాని తల్లిదండ్రులు యీ విషయంలో ఎంత బాధపడ తారో అన్నదే అతను ఓర్మితో ఆలోచించిన విషయం. వెళ్ళాడు. శని, ఆదివారాలుకూడా కలిసాయి. తిరిగివచ్చి నదికి స్నానానికి వెళ్ళేసరికి అయిదు దినాలనాటి ఆ సంఘటన గుర్తుకొచ్చింది.

ఆ నగ దొరికిందా, లేదా, వెతికారా, ఏమయింది మొదలయిన వాటిగురించి మనసులో ఆరాటం. స్త్రీలలో వెతుకుతున్నాడు ఎప్పుడన్నా అసంకల్పంగా ఆమె కలిస్తే బావుణ్ను. ఈవిషయాలన్నీ తెలుసుకోవా లనుకొంటున్నాడు.

మరోవారం గడిచింది. ఆరోజు ఉదయాన అదే రాయి మీద స్నానానికి వచ్చికూచున్నాడు. పెట్టెతాళంచెవి పడిపోయింది జారి. వెతుకుతున్నాడు. ఒకరిద్దరు అడిగారు ఏమిటని. తాళంచెవి అని విన్న తర్వాత వెళ్ళిపోయారు. ఇంకో విలువైన వస్తువైతే ఆనాడు రాంబాబు వెదికినట్టే వెతికి తోడు పడేవారు. రాయి దగ్గర. లోతుహెచ్చు. మునక వేయాల్సివస్తోంది.

ఉదయం....

జనం రద్దీగానే వున్నారు. యువకులు, యువతులు వృద్ధురాళ్ళు, వృద్ధులు యెంతోమంది. ఏవోమంత్రాలు జపించేవాళ్ళు, ప్రార్థనలుచేసుకుంటున్నవాళ్ళు, కీర్తనలు పాడుతున్న భక్తురాండ్రు—సందడిగానూ, చూడ ముచ్చటగాను వుంది. బూరగాళ్ళ వాళ్ళు కూడా అక్కడే మునిగేస్తున్నారు. రాంబాబు మొదట్లో అసహ్యించుకొన్నా అలవాటు పడి పోయాడు.

తాళంచెవి దొరకలేదు. కాని ఎంతో దూరం పోవటానికి ఆస్కారంలేదు. రాయిమీదుగా జారింది. అక్కడే పడివుంటుంది. విసుగెత్తిపోయి ఆఖరి ప్రయత్నం చేశాడు రాంబాబు.

వస్తున్నారు .... పోతున్నారు .... జనం సందడి.

రాంబాబు కళ్ళు ఆశ్చర్యపోయాయి. ఆ ప్రక్కనున్నవారు ఎవరూ చూడలేదు. అవును. అదే. దొరికింది. కాని—ఎలా—ఎలా బయటికి తీయడం—వీళ్ళంతాచూస్తారు. నాది నా దనొచ్చు· లేక పోలీసు స్టేషన్‌కే తీసుకెళ్ళొచ్చు—ఏమిటి గత్యంతరం? ప్రవాహం ఉరకల్లో మళ్ళీపోతే. కాలుతో పట్టుకోడానికి మనసు అంగీకరించడం లేదు. ఇసికలో పాతాడు—అక్కడే. తనలోని ఆశ్చర్యానుభూతులు బయటికి కనబడకుండా విఫలయత్నం చేస్తున్నాడు.

మనసులో ఆలోచన మెరిసింది. గబగబా ఒళ్ళు తోము కున్నాడు. తువ్వాలు నీటిలోకి ముంచాడు. వెతికాడు. వస్తువు లేదు. అయ్యో! అయ్యో! కనిపించదు. దొరకదే. పోయింది. సిరిని తన్నినట్టయింది. చేయితో పక్కలు వెతికాడు. దొరికింది. ఇసికలో కూరుకొనేవుంది. తువ్వాల్లో అందంగా మడత, నీటిలోనే, పెట్టాడు. పైకితీసి జాగ్రత్తగా పిండాడు. అప్పటికి సహాధ్యాయులు వెళ్ళిపోయారు. మంచిదే అయింది. సబ్బుడొక్కూ మడత తువ్వాల పట్టుకొని వెళుతున్నాడు. అతని గుండెలు లబలబ కొట్టు కొంటున్నాయి. పోలీసు దారిలో కన్పించాడు. కాళ్ళు వణికాయి. పక్కకు తప్పుకొని, ధైర్యం, నిర్భయం నటించి నడుస్తున్నాడు.

గదిలోకివెళ్ళాడు. ఎవరూ గదిలోలేరు. ఫలహారాలు చేస్తు న్నారు. చుట్టూచూశాడు. తోటివారి సామానులు అతనివేపు

చూస్తున్నాయి. భయంగా పెట్లో దాచబోయాడు. తాళం లేదు. పరుపులో దాయా లనుకొన్నాడు. ఎవరన్నావిప్పితే. ఉపకరణలు కోసం తయారు చేసిన అట్టపీర్లలో దాయాలను కున్నాడు. చివరికి మంచిఆలోచన మెరిసింది. ఫేంట్‌జేబులో వేశాడు. చిన్నశబ్దం. భయపడ్డాడు. ఎత్తుగా కన్పిస్తోంది. ఇంకో యుక్తి. తలలో తటిల్లుమంది. రుమాలు జేబులో పెట్టాడు. కంగారు పడుతున్నట్టు అతనికే అనుమానమయింది. ఈ విషయం యింకెవరికో చెప్పి తనబరువు తీర్చుకోవాలను కొంటున్నాడు. ఇంకెవరికి చెప్పడమో అతనికి తెలీదు. నిశ్చలత్వం నటించాడు. మెట్లెక్కుతున్న శబ్దం. ఇంకా స్థిమిత పడినట్టు భంగిమలు మార్చుకొన్నాడు.

''ఇదిగో నీ ఫలహారం—కాఫీ''....అందుకొని తనహోటులో పెట్టుకొని తింటున్నాడు. ఆ స్నేహితునికి థాంక్స్ అన్నా తెలియ చెప్పలేకపోయాడు. అంతా దుస్తులు మార్చుకొని పుస్తకాలు తీసు కొని క్లాసుకు పోతున్నారు. అతనుమెల్లగా తింటున్నాడు. రాంబాబు నెమ్మదిగా తింటాడని అందరికీతెలుసు. ఎవరూ ఎక్కువగా జోక్యం చేసుకోలేదు. అంతా మెల్లగా వెళ్లిపోయారు. ఈ దినం క్లాసుకి వెళ్ళాలనిలేదు. ఓ కుర్రాడితో సెలవు దరఖాస్తు పంపించాడు.

''తాళం పోయిందండి. బట్టలు పెట్లో వుండిపోయాయి. తాళం విరగ్గొట్టి బాగుచేయించాలి.'' అని కారణం చెప్పాడు. నిజానికది సకారణం అనిపించుకోదు.

ఎవరూలేరు.

కింద స్పెషల్ డ్యూటీ కుర్రవాడు. వంట బ్రాహ్మణుడు. నౌకరీ—పెరుగుతెచ్చే గొల్లమనిషిగోల—అన్నీ వినిపిస్తున్నాయి. తాళం విరగ్గొట్టాడు. చుట్టూచూశాడు. మనుషులు లేకపోవడం వెలికాడు. పేంట్‌జేబులోది జాగ్రత్తగాతీసి పెట్లోదాచాడు. పైనబట్టలు జాగ్రత్తగా సర్దాడు. వీధిలో ఎదురుగావున్న ఫాన్సీషాపులో ఓ మంచి తాళంతీసుకున్నాడు. డ్యూప్లికేట్‌తాళం చెవి పెట్టెలో పడేసాడు. తాళంవేసాడు. పెట్టెపైన పరుపు చుట్టపెట్టాడు.

విశ్రాంతిగా రాంబాబు నిట్టూర్చడానికి గంటన్నర తర్వాత అవకాశం కలిగింది. అతని మనసులోని కల్మషంని ఓపక్క పాతరవేసాడు. దాని దుర్గంధం తగ్గింది. అతనిలోంచి పొంగిపొర్లే భీరుత్వం స్థిమితపడింది. ఇపుడు రాంబాబుని ఇంకో సమస్య భాధ పెట్టడం ఆరంభించింది.

ఎవరన్నా తనకేసి పరిశీలించారేమో! తనవెనుకవచ్చి యివన్నీ దొంగచాటుగా పరీక్షిస్తున్నారేమో! అయితే యెలా? బయటికివచ్చాడు. చుట్టూచూసాడు. కిందికి, రోడ్డుమీదికి, చూసాడు. తనవేపు ఎవరూ చూడడంలేదు. లోకం తనని గమ నించడంలేదు.

రాంబాబుకి ఆ వస్తువు ఏం చేయడమో తట్టడంలేదు. ఆమె కనిపిస్తే బావుణ్ను. ఆమెకి యిచ్చేయాలి. ఆమె జీవనజ్యోతి ఆమెకి అందిపోవాలి. జీవితంలో తనకి తొలి శాంతి లభిస్తే ఎంత అదృష్టవంతుడో వూహించుకొంటున్నాడు.

రేవుకివెళ్ళి చూడాలనిపించడంతో, రాంబాబు గదికి తాళంవేసి నదివేపు నడిచాడు. మనుషులు పలచబడిపోయారు. ఒకరిద్దరు ఆడమ్మలు—ఇద్దరుముగ్గురు చిన్నపిల్లలు.

నాగావళి విచారంతో చిక్కిపోయింది. ఈ కొద్ది దినాలకే ఆమెలో యెంతో మార్పు కనిపించింది. ఆ రాయిమీద రాంబాబు కూచున్నాడు. ఏదన్నా ఓ ఆకారం కదిలితే అది ఆమే నేమోనని వింతగా పరిశీలిస్తున్నాడు.

కొత్తది చేయించుకున్నారా? లేక ఏమయిందో?

రాంబాబు తన తెలివితక్కువతనం ఎన్ని చిక్కులలో పెడుతుందో అని ఆలోచిస్తున్నాడు. ఆమెపేరన్నా కనుక్కోలేక పోయాడు. ఆ యిల్లు యెలా పోలికపట్టడం? ఎలా ఆమెకీ వస్తువుచేర్చడం?

ఓ రోజు అంటే మరుసటిరోజే ఆమె వెళ్ళినదారే తొక్కివెళ్ళాడు. రాంబాబుకి యిలా పసికట్టడం యింకా చేత కాదు. ఎవరో ఓ అమ్మాయి అతనివేపు తీక్షణంగాచూస్తే భయంవేసింది. వీధులు తిరగడంమానేసాడు. రాయి దగ్గర వెతుకుతూ కూచున్నాడు. రెండుదినాలు పూర్తిగా ఆమెకోసం అక్కడ కూచోడం ఓ విధంగా తెలివితక్కువతనమే—కాని రాంబాబులో పేరుకొన్న ఆశ మరి యెలాంటిదయుంటుందో ఆ సంఘటనతో ఊహిస్తే బోధపడకపోదు.

ఆ రోజు సాయంత్రం ప్రధానోపాధ్యాయులువారు పిలిచి, కోప్పడి, చాలా చీవాట్లుపెట్టారు. అతనికి అబద్ధం చెప్పడం రాకపోవడమే అన్ని హీనవచనాలకీ తలవొగ్గేందుకు కారణ భూత మయింది.

రాంబాబుకి రాత్రుళ్ళు బాగా నిద్రపడట్టడంలేదు. భయ పెట్టేస్వప్నాలు వస్తున్నాయి. ఓ స్నేహితుడు చూసాడట. పోలీ సులు పెద్దకర్రలు పట్టుకొని వచ్చారట. తనిని కర్రలతో పొడిచి వెళుతున్నారట. సుమిత్ర – తమ్ముడూ—తమ్ముడూ అని అరుస్తూ అతనివెనుక పరుగిడుతో వస్తుందట. ''ఈ నగ యీామెది—యీామెదీ' అని చెబుతున్నాడట—ఆ మాట పలవ రించినట్టు తోటివాళ్ళు చెబుతున్నారు. తనలో, మస్తిష్కంలో పాతరవేయబడిన యీా కల్లోలం యింకెన్నాళ్ళో దాగదు. సమయం మించి పోయింది. తన జీవితం పాడయిపోకుండా చూసుకోవాలి. రాత్రంతా కంటిమీద రెప్పలేదు. ఇదేవిషయాన్ని ఆలోచించాడు. చివరికి ఒక నిశ్చయానికివచ్చాడు. ఆ నాడు గులాబీని పారేసినచోట దీన్నీ నాగావళికి అంకితం యిచ్చేయాలి—అనుకొని ''భగవాన్! యీావిషయంలో నాలో యెట్టి దురాలోచనాలేదు. ఎవరికీ అన్యాయం చేయాలని అనుకోలేదు. ఎవరినీ బాధ పెట్టడం నా ఆంతర్యంకాదు. ఆమెకీ మాంగల్యం అందితే నా జీవితంలోని తొలి అధ్యాయం కృతార్థతతో పునీతుడనసే వాడిని. నే పాపం కలిస్తే ఖచ్చితంగా యిస్తానన్నాను. లేకపోతే ఆ నాగా వళికే మళ్ళీ అప్పజెప్పుతాను. నన్నురక్షించు భగవాన్! నాకంటికి నిద్రరానియ్యి భగవాన్''. త్రికరణశుద్ధిగా ప్రార్థించాడు. చక్కని నిద్రపట్టింది రాంబాబుకి.

* * *

ఆ దినం ఆదివారం. పక్షం దినాలయింది సరిగ్గా. ఆమెని తొలిసారి ఆఖరిసారి చూడడం అదేనేమో అనుకొంటు న్నాడు. సిద్ధంచేసుకుని ఆసాయంత్ర నాలుగ్గంటలు సమయాన నాగావళి సైకతాలలో తిరుగుతున్నాడు.

దూరాన శవదహనం ..........

రోజుకి ఒకటో రెండో శవాలు కాలడం అతనికి వింతేమీ కాదు. ఆ శవానికిదూరం—యింకాపోయి—నది మలుపుతిరిగిన దగ్గర బలంగా విసిరేసి పోవాలనుకున్నాడు. క్రమంగ చీకటికూడ వికటాట్టహాసంచేస్తూ సమీపిస్తోంది.

నది ఒడ్డున తడిగుడ్డలతో సౌకాళ్ళల్లోకి తలదించు కొని ఓ దౌర్భాగ్యుడు అలుస్తూ మూలుగుతూ వున్నాడు. "సుమిత్రా...నా సుమిత్రా". అంతే. ఆమాటలు–రాంబాబుకి—ఆ సుమిత్ర ఎవరో ఏం తెలుసును—ఏమర్థ మౌతాయి. అతనికి అక్కడ ఆగి అడగాలని బుద్ధి పుట్టకపోవడం విచిత్రం. స్త్రీ పేరు గదా–ఎవరో, ఏమిటో అనేనా అడిగివుంటే—రాంబాబు ఆ జీవిత జ్యోతి అంత తొందరగా అనంతకాంతితో లీనమౌతుందని ఊహించలేక పోయాడు.

జ్వాల తగ్గి పోతోంది.

మలుపులో ఒక్కడూ — పైన — కాంతి వత్సరాల దూరాల్లో నక్షత్రాలు—చుట్టూ చిక్కని చీకటి—నిశ్శబ్దం శుష్కరాగం—

భగవాన్ నీ, నదీమాతనీ మనసార స్మరించి, ఆమెకి మేలుచేయండి అని దీర్ఘంగా ప్రార్థిస్తూ విసిరేసాడు.

అతనివెనుక ఎవరో వస్తున్నట్టువుతోంది.

చిక్కని గుండెలవాడు రాంబాబు. వెనక్కి చూడడంలేదు.

శవదహనం చోట పెద్ద జ్వాల రేగింది. బహుశా అదే అంతిమ జ్వాల. చీకటిలో కలిసిపోయింది ఆ జ్వాల.

ఆ ప్రక్కనించే వెళ్ళిపోతోన్నాడు.

కర్ర పట్టుకొని పొడుస్తున్న ఓ వ్యక్తి 'సివారికి పుస్తె కూడా సేయించారట—' చెబుతున్నాడు పక్కవారితో.

రాంబాబు ఆగాడు. అతనిలో అంతర్లోకాలు క్షణం స్తబ్ధమయాయి. ప్రమిదనిండా చమురుంది. వత్తికొడి గట్టనూ లేదు. ఎలా ఆరిపోయిందా వెలుగు లీనుతున్న జ్యోతి. అతనికి నమ్మకం చాలడంలేదు. ఇంకెవరో—ఓ పెద్దగాలి చాలు–యీ జ్యోతి తమోరాశిలో లీనమై పోవటానికి అన్నది రాంబాబుకి అందని ఊహ.

భర్త దగ్గర ఆఖరి క్షణాల్లో అన్న మాట లేవో చెబు తున్నాడు—అందులో ఒకడు. ఆ మాటలు వాళ్ల ఉచ్చారణలో రాయడం నాకు చేతకాలేదు. కాని ఆ భావం మాత్రం యిక్కడ సుమిత్ర మాటల్లో చెబుతున్నాను.

'మీరు—మళ్ళీ .... వివాహం—చే .... సుకొంటె. ఇది .... నా .... కడ .... సారి కోరిక .... నేను దురదృష్ట .... వంతురా లను. నాకోసం .... తయా .... రు చే .... సిన ఆ మంగళ సూత్రం .... పాడు చెయ్యొద్దు. ఈ ఒక్క .... కోరిక .... తీ—' ఆమె దాంపత్యంలో, బహుశా, ఇదే పెద్ద సంభాషణ.

ఓ చిన్న పరిచయం—ఓ రోజునాటి సంఘటన.

ఆ మాటలు విన్న తరువాత అతని హృదయం ద్రవించి కనుల్లోంచి కారుతోంది. భయం పీడిస్తోంది.

మరోసారి భగవాన్‌ని స్మరించుకొన్నాడు.

కళ్లనించి కట్టలు తెంచి వస్తోన్న ప్రవాహం రోడ్డు ఎక్కేసరికి చెక్కిళ్లపై యింకిపోయింది.


# న ర సు ర లు

చేపట్టిన విడువలేని చదివిన మరువలేని అపూర్వ శిల్ప చిత్రరచనా సంపుటి

రచన : శ్రీ వర్మ, గజపతి, మోహనం

Dr. P. K. GODE, M.A., D.Litt (Paris) వంటి విశ్వవిఖ్యాత భారతీయ సాంస్కృతీ పరిశోధకులచే ప్రశంసింపబడిన రచనలు.

ఏకవీర, కాకతి, రేణుక, రేవతీ దేవతల దేశదేశాల పోలికలు సచిత్ర సమగ్ర చరిత్ర ఒక ప్రత్యేకత.

ముద్రణా కార్య మారంభమైనది. ముందుగా పంపువారికి ప్రతి రు. 15/-లు

వారి విలాసం కూడ ప్రకటింపబడును. ముద్రణానంతరం రు. 25/-లు

గ జ ప తి రా య వ ర్మ, P.O. తా డే ప ల్లి గూ డెం